సాక్షి
రాజన్న సిరిసిల్ల
శనివారం । 10 । మే । 2025



అమ్మవార్లకు మొక్కులు

వేములవాడఅర్బన్: మండలంలోని సంకెపల్లిలో యాదవ సంఘం ఆధ్వర్యంలో సౌడాలమ్మ పండుగ, కొడుముంజలో పెద్దమ్మ పండుగ నిర్వహించారు. చల్మెడ లక్ష్మినరసింహరావు, ఏనుగు మనోహర్‌రెడ్డి దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.



రాజన్నా.. దీవించు

రాజన్న సన్నిధిలో వేసవి సెలవుల రద్దీ కొనసాగుతోంది. శుక్రవారం 30వేలకు పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

10లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.0/28.0

జిల్లాలో నేడు వాతావరణం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది. ఉక్కపోత కొనసాగుతుంది. వడగాలులు వీస్తాయి. రాత్రి కాస్త చల్లగా ఉంటుంది.



చెత్త కాదు.. ఫైళ్లగుట్ట

ఎంపీడీవో ఆఫీసులో పేరుకుపోయిన ఫైళ్లు

కోనరావుపేట: కోనరావుపేట మండల పరిషత్ కార్యాలయంలోని ఉపాధి హామీ కార్యాలయం ఫైళ్లతో నిండిపోతోంది. ఫైళ్లతో సగం కార్యాలయం గుట్టలుగా పేరుకుపోయింది. గత కొన్నేళ్లుగా జరుగుతున్న ఉపాధి హామీ పనులు, సామాజిక తనిఖీకి సంబంధించిన ఫైళ్లన్నీ సంచుల్లో కట్టి పెడుతున్నారు. ఇలా పెట్టుకుంటూ ఏళ్లుగా ఇలా మూలకు పడేస్తున్నారు. దీంతో కార్యాలయంలో ఫైళ్లన్నీ గుట్టలుగా మారుతున్నాయి. సగం కార్యాలయం వీటికే పోవడమే కాకుండా క్రిమి కీటకాలు చేరే అవకాశముందని పలువురు భావిస్తున్నారు. ప్రజలు, సిబ్బంది భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఎండుతున్న మొక్కలు

నీళ్లులేక ఎండిపోతున్న మొక్కలు

ముస్తాబాద్: ముస్తాబాద్– కామారెడ్డి ప్రధాన రహదారి పక్కన మొక్కలు నీరు లేక ఎండిపోతున్నాయి. ముస్తాబాద్, నామాపూర్ మధ్య ఈ పరిస్థితి నెలకొంది. మొర్రాయిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని రెండు కిలోమీటర్ల పరిధిలో రహదారి పక్కన ఉన్న మొక్కలకు పంచాయతీ సిబ్బంది నీరందించడం లేదు. మండువేసవిలో మొక్కలు ఎండుతున్నా... పట్టించుకోవడం లేదని ప్రజలు అంటున్నారు. పంచాయతీలో నిధులున్నా.. మొక్కలను కాపాడుకోవడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని, ట్యాంకర్ల ద్వారా నీరు పట్టాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.



ఇసుక రీచ్‌లు తెరవాలి

ధర్నా చేస్తున్న ట్రాక్టర్ యజమానులు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్, పదిర, వెంకటాపూర్ గ్రామాల్లో ఇసుక రీచ్‌లు ప్రారంభించాలని ట్రాక్టర్ యూనియన్ల ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సిరిసిల్ల– కామారెడ్డి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. రెండు గ్రామాల నుంచి 70ట్రాక్టర్లతో తరలివచ్చారు. కలెక్టర్ ఆదేశాలతో నారాయణపూర్, వెంకటాపూర్ ఇసుక రీచ్‌లను రద్దు చేశారు. పదిర రీచ్‌కు మాత్రమే అనుమతులు ఇవ్వడం వివాదాస్పదంగా మారింది. దీంతో తమ గ్రామాల్లోనూ రీచ్‌లు ప్రారంభించాలని ఆందోళన నిర్వహించి, తహసీల్దార్ సుజాతకు వినతిపత్రం ఇచ్చారు.

న్యూస్‌రీల్

ప్రభుత్వ ఆస్పత్రిపై రెడ్‌క్రాస్ గుర్తు



వేములవాడ ఏరియా ఆస్పత్రిపై రెడ్‌క్రాస్ గుర్తు

వేములవాడఅర్బన్: యుద్ధమేఘాలు కమ్ముకున్న వేళ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఆస్పత్రుల భవనాలపై పన్నెండు అడుగుల పొడవు, వెడల్పుతో రెడ్‌క్రాస్ గుర్తు వేయడం జరిగిందని వేములవాడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య తెలిపారు. వేములవాడ ఏరియా ఆసుపత్రి భవనంపై సైతం గుర్తును వేశామని పేర్కొన్నారు. యుద్ధ సమయంలో అత్యవసర వైద్యసేవలు అందించే ఆసుపత్రుల మీద దాడులు చేయకూడదనే జెనీవాలో కుదుర్చుకున్న అంతర్జాతీయ యుద్ధ నియమాల్లో భాగంగా, గుర్తు వేయడం జరిగిందన్నారు.

దర్శావళి ఉత్సవాలకు రండి



కేటీఆర్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: ఎల్లారెడ్డిపేట మండలం సింగారం గ్రామంలోని దర్శావళి దర్గా వద్ద ఈ నెల 14,15 తేదీల్లో నిర్వహించే ఉర్సు ఉత్సవాలకు రావాలని కోరుతూ సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్‌కు శుక్రవారం నిర్వాహకుడు అజీజ్‌బాయి ఆహ్వాన పత్రిక అందజేశారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అజ్మతుల్లా హుస్సేన్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందించారు. ముస్లిం కమిటీ సభ్యులు చాంద్ పాషా, షేక్ సాహెబ్, షేక్ గౌస్, మహమ్మద్ జబ్బర్, జహంగీర్, ఇర్ఫాన్, గౌస్ పాల్గొన్నారు.

చేనేత శిల్పికి సన్మానం



విజయ్‌కుమార్‌ను సన్మానిస్తున్న దత్తాత్రేయ

సిరిసిల్ల: అగ్గిపెట్టెలో ఇమిడే చీర సృష్టికర్త, సిరిసిల్ల చేనేత శిల్పి నల్ల విజయ్‌కుమార్‌ను ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో శుక్రవారం హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ సన్మానించారు. అగ్గిపెట్టెలో ఇమిడే చీర, బంగారు, వెండిపోగులతో తయారు చేసిన చీరను మగ్గంపై నేసి అబ్బుర పరిచారు. ఆ చీరను దత్తాత్రేయ సతీమణికి ఉప రాష్ట్రపతి జగదీశ్ దినకర్ చేతుల మీదుగా బహుకరించారు. విజయ్‌కుమార్‌ను దత్తాత్రేయ అభినందించారు.

ఇంటర్‌లో స్పాట్ కౌన్సెలింగ్

సిరిసిల్ల: ఇంటర్ 2025–26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలలో ఎస్టీ బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ సమన్వయ అధికారి డీ.ఎస్.వెంకన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), సిరిసిల్ల ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), మానాల (వేములవాడ), ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), అక్కన్నపేట (హుస్నాబాద్), ఎస్టీ గురుకుల జూనియర్ కళాశాల మంథనిలో సీట్ల భర్తీకి స్పాట్ కౌన్సెలింగ్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాల (బాలికలు), సిరిసిల్ల (ఇందిరమ్మ కాలనీ) సారంపల్లిలో మే 16న నిర్వహించే కౌన్సెలింగ్ హాజరు కావాలని కోరారు. 10వ తరగతి ఉత్తీర్ణులు అయిన బాల, బాలికలు అన్నీ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో పాటు, ఒక సెట్ జిరాక్స్ తీసుకొని వచ్చి అడ్మిషన్లు పొందవచ్చని వెంకన్న కోరారు. వివరాలకు ఫోన్ నంబర్ 83339 25362ను సంప్రదించాలన్నారు.

శ్రద్ధ లేదు.. శుద్ధి కాదు!



- ఇది సిరిసిల్ల నడిబొడ్డున ప్రవహించే ప్రధాన మురికి కాలువ. ఒకప్పుడు ఇది మంచినీరు పారే ఉదారువాగు. సాయినగర్ మానేరువాగు నుంచి మంచినీరు ఈ కాలువలో ప్రవహిస్తే పట్టణవాసులు బిందెలతో తీసుకెళ్లి తాగేవారు. ఇది 50 ఏళ్ల కిందటి ముచ్చట. కాలక్రమంలో మురికి నీటి కాలువగా మారింది. అంబేద్కర్‌నగర్ గుండా వెళ్లే ఈ కాలువలో పట్టణ మురికి అంతా ప్రవహిస్తోంది.



- ఇది సిరిసిల్ల పాత బస్టాండు, శాంతినగర్ గుండా ప్రవహించే కచ్చా మురికి కాలువ. పట్టణంలోని అద్దకం (డయింగ్) యూనిట్లలో వాడే రంగులు, రసాయనాలు, వ్యర్థ జలాలు ఈ కాల్వలో పారుతుంటాయి. వర్షాకాలంలో వరద పోటెత్తి చెరువులను దాటి మధ్యమానేరు వాగులో కలుస్తుంది.



శుద్ధిచేసిన మురికి నీటిని బయటకు పంపించే ప్లాంటు

- సిరిసిల్ల మురుగు 'శుద్ధి' అయ్యేనా?
- రూ.61.25 కోట్లతో ఎస్టీపీ ఏర్పాటు
- బిల్లులు రాక మధ్యలో ఆగిన పనులు
- పెండింగ్‌లో యంత్రాల బిగింపు

సిరిసిల్ల: సిరిసిల్ల మురికి నీరు ఇలా పట్టణ శివారులోని తుమ్మలకుంటలో కలుస్తుంది. అక్కడి నుంచి మానేరు వాగులో కలిసి మధ్యమానేరు జలాశయంలోకి చేరుతుంది. ఆ నీటినే మిషన్ భగీరథ ద్వారా శుద్ధిచేసి తాగునీరుగా జిల్లాలోని అన్ని జనవాసాలకు అందిస్తున్నారు. ఇలా చేయడం ప్రజారోగ్యానికి ఎప్పటికైనా ముప్పే అని భావించిన అధికారులు మురికి సమస్యను శాశ్వతంగా తొలగించేందుకు పట్టణ శివారులోని శాంతినగర్ వద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ను ఏర్పాటు చేశారు.

పద్మనగర్‌లో లోపభూయిష్టంగా నిర్మాణం

పద్మనగర్ ప్రాంతంలో మురికి నీటిని శుద్ధి చేసేందుకు ఏర్పాటు చేసిన ఇంఫ్లూయెంట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఈటీపీ) విఫలమైంది. మున్సిపల్, ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపంతో రూ.1.98 కోట్లతో 2019లో నిర్మించిన మినీ ఈటీపీ ప్లాంటు పనికి రాకుండా పోయింది. మురికి కాల్వకు అడ్డంగా మురికి నీరు శుద్ధి అయ్యే విధంగా ఈటీపీ ప్లాంటును నిర్మించాల్సి ఉండగా.. నీరు కిందనుంచి వెళ్లిపోయే విధంగా ప్లాంటును పైకి నిర్మించారు. ఫలితంగా ఈటీపీ ప్లాంట్ నిర్మించిన నాటి నుంచి నిరుపయోగమే అయింది. దీంతో శాంతినగర్‌లో ఎస్టీపీ ప్లాంటును ఏర్పాటు చేశారు.

రూ.61.25 కోట్లతో ఎస్టీపీ ప్లాంటు

పట్టణంలో ప్రధాన మురికి కాల్వలు రెండు ఉన్నాయి. ఈ కాల్వల్లో వచ్చే మురికి నీటిని శుద్ధిచేసి మానేరు వాగులోకి వదలిపెట్టే లక్ష్యంతో శాంతినగర్ డబుల్ బెడ్రూం ఇళ్ల కాలనీ వద్ద సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎస్టీపీ) ఏర్పాటు చేశారు. ఆరు ఎకరాల భూమిని కొనుగోలు చేసి రూ.61.25 కోట్లతో ఎస్టీపీని నిర్మించారు. 2022లో పనులు ప్రారంభించగా.. 90శాతం పూర్తి అయ్యాయి. మురికి నీటిని శుద్ధిచేసే యంత్రాలను బిగించాల్సి ఉంది. ఇవిపూర్తయితే మురికి నీటి శుద్ధి సాధ్యమవుతుంది.

బిల్లులు రాక.. పనులు పెండింగ్

ప్లాంటు నిర్మించిన కాంట్రాక్టర్‌కు రూ.30 కోట్ల మేరకు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో బ్యాలెన్స్ పనులు చేయడం లేదు. ఫలితంగా ఎస్టీపీ ప్లాంటు వినియోగంలోకి రావడం లేదు. మురికి నీటితో భూగర్భ జలాలు కలుషితమవుతూనే ఉన్నాయి.



శాంతినగర్‌లోని ప్లాంటు ముఖద్వారం

సిరిసిల్లలో వార్డులు:	39
పట్టణ జనాభా:	1.05 లక్షలు
విస్తీర్ణం:	55.47 చదరపు కిలోమీటర్లు
ప్రధాన మురికి కాల్వలు:	02
కుటుంబాల సంఖ్య:	33,608

ప్లాంటును పూర్తి చేయాలని కలెక్టర్, మున్సిపల్ ప్రత్యేక అధికారి సందీప్‌కుమార్ ఝా పలు మార్లు సమీక్షించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. భారీగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఎస్టీపీ పనులు పురోగతి సాధించడం లేదు.

పనులు పూర్తి చేయిస్తాం

సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు(ఎస్టీపీ) నిర్మాణ పనులు చాలా వరకు పూర్తి అయ్యాయి. కొన్ని పనులు చేయాల్సి ఉంది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటాం. ఎస్టీపీ పూర్తి అయితే సిరిసిల్ల మురికి నీటిని శుద్ధి సాధ్యమవుతుంది.

– వరుణ్, డీఈఈ, పబ్లిక్ హెల్త్, సిరిసిల్ల

పత్రికా స్వేచ్ఛపై దాడి సరికాదు



సిరిసిల్ల ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న జర్నలిస్టులు

- సిరిసిల్లలో నల్ల బ్యాడ్జీలతో జర్నలిస్టుల నిరసన ర్యాలీ

సిరిసిల్లటౌన్: పత్రికా స్వేచ్ఛను కాపాడాల్సింది పోయి అక్రమంగా దాడులకు పాల్పడటం సిగ్గుచేటని జర్నలిస్టులు మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో 'సాక్షి' దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంట్లో పోలీసులు వారెంటు లేకుండా సోదాలు చేయడాన్ని ఖండించారు. ఈ మేరకు శుక్రవారం సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ర్యాలీ చేపట్టి ధర్నా చేపట్టారు. 'సాక్షి' ఎడిటర్ ఇంటిపై పోలీసుల దాడిని ఖండిస్తున్నామని అన్నారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు ఆకుల జయంత్‌కుమార్,ప్రధాన కార్యదర్శి ఆడెపు మహేందర్, కరుణాల భద్రాచలం, టీవీ నారాయణ, ఊరడి మల్లికార్జున్, రాపెల్లి సంతోష్, కాంబోజి ముత్యం, కాయితీ బాలు, పాలమాకుల శే ఖర్, ప్రెస్‌క్లబ్ ఉపాధ్యక్షుడు బొడ్డు పర్శరాములు, కోశాధికారి వంకాయల శ్రీకాంత్, సహాయ కార్యదర్శి కంకణాల శ్రీనివాస్, సభ్యులు పాల్గొన్నారు.

మూడు కేజీబీవీలు అప్‌గ్రేడ్

- బోయినపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ అర్బన్ మండలాల్లో ఇంటర్ తరగతులు
- ఈ విద్యా సంవత్సరంలో ప్రారంభం



బోయినపల్లి కేజీబీవీ కళాశాల

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలోని మరో మూడు కేజీబీవీలు కళాశాలలుగా అప్‌గ్రేడ్ కానున్నాయి. బోయినపల్లి, ఇల్లంతకుంట, వేములవాడ అర్బన్ మండలాల కేజీబీవీల్లో ఈ విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ కోర్సులు అందించనున్నాయి. ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు బోయినపల్లిలో ప్రచారం చేస్తున్నారు. ఒక్కో కళాశాలలో రెండు కోర్సులు, క్లాస్‌కు 40మంది విద్యార్థినులతో సీట్లు భర్తీ చేయనున్నారు. బోయినపల్లిలో బైపీసీ, ఎంఎల్‌టీ, ఇల్లంతకుంటలో ఎంపీసీ, బైపీసీ, వేములవాడఅర్బన్‌లో సీఈసీ, ఏఐ కోర్సులు ప్రవేశపెట్టారు. విద్యాబోధనకు కావాల్సిన ఫ్యాకల్టీని వచ్చే నెలలో నియామకం చేస్తారని అధికారులు తెలిపారు. విద్యార్థినులకు అవసరమైన వసతులు జూన్ లోపు పూర్తి చేయనున్నారు. 'బోయినపల్లి కేజీబీవీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరంలో ఇంటర్ మొదటి సంవత్సరానికి బైపీసీ, ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) కోర్సులు ప్రారంభిస్తున్నాం. కళాశాలలో చేరాలని ప్రచారం చేయడం జరుగుతోంది' అని బోయినపల్లి కేజీబీవీ ఎస్‌వో లింగవ్వ తెలిపారు.

సమ్మెలో వైద్యారోగ్య ఉద్యోగులు

సిరిసిల్లటౌన్: దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెలో వైద్యారోగ్య శాఖ ఉద్యోగులు పాల్గొంటారని సీఐటీయూ నేతలు పేర్కొన్నారు. శుక్రవారం సిరిసిల్ల జిల్లాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మినారాయణకు వినతిపత్రాన్ని అందజేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్స్, అసోసియేషన్స్ జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ పిలుపులో భాగంగా మే 20న తెలంగాణ వైద్యారోగ్య ఉద్యోగులు(సీఐటీయూ అనుబంధం) పాల్గొంటున్నారన్నారు. నాయకులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, పద్మ, నాగమణి, జయ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


బ్యాంకు రుణాల్లో జిల్లాకు అవార్డు

- డీఆర్డీవో, సిబ్బందికి కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందన

సిరిసిల్ల: స్వశక్తి సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడంలో ఉత్తమ సేవలు అందించిన జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కలెక్టరేట్‌లో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 2024–25లో 7,969 సంఘాలకు రూ.533.73 కోట్లు లక్ష్యంకాగా రూ.542.30 కోట్లతో 102శాతం ప్రగతి సాధించారని పేర్కొన్నారు. ఒక్కో గ్రూప్ ఫైనాన్స్ రూ.12.48 లక్షలు ఇవ్వడంలో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నారన్నారు. దీంతో రాష్ట్రస్థాయిలో జిల్లాకు అవార్డు వచ్చిందన్నారు. పీఆర్ మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ లోకేశ్‌కుమార్, సీఈవో సెర్ప్ దివ్య దేవరాజన్ చేతుల మీదుగా డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవో, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సరిత అవార్డు స్వీకరించారని తెలిపారు.

రికవరీలోనూ 99.74 శాతం

బ్యాంకు లింకేజీ రికవరీ 99.74 శాతంతో రాష్ట్రంలో జిల్లా రెండోస్థానంలో ఉందని, 2023–24 ఆర్థిక సంవత్సరంలోనూ లక్ష్య సాధనలో భాగంగా బ్యాంకు లింకేజీ 106 శాతం సాధించారని కలెక్టర్ వెల్లడించారు. ఆర్థికంగా ప్రగతి సాధించి ఆయా కుటుంబాలు తమ పిల్లల ఉన్నత విద్యాభ్యాసానికి బ్యాంకు రుణాలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు డిసెంబరులోగా లక్ష్యం సాధించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా కోరారు. డీఆర్‌డీవో శేషాద్రి, అదనపు డీఆర్‌డీవో గొట్టె శ్రీనివాస్ పాల్గొన్నారు.



డీఆర్‌డీవో శేషాద్రి, డీఆర్‌డీఏ సిబ్బందిని అభినందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సర్వేయర్ల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

జిల్లాలో లైసెన్స్ సర్వేయర్ల శిక్షణకు ఆసక్తి గల అభ్యర్థులు మే 17వ తేదీలోగా దరఖాస్తులు చేయాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఒక ప్రకటనలో కోరారు. లైసెన్స్ సర్వేయర్ల శిక్షణ కోసం అర్హత గల అభ్యర్థుల నుంచి తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ దరఖాస్తులు ఆహ్వానిస్తుందన్నారు. మే 5 నుంచి మీ సేవా కేంద్రాలలో రూ.100 చెల్లించి దరఖాస్తు నమోనాలను పొందవచ్చన్నారు. ఇంటర్‌లో గణితంలో 60శాతం మార్కులు సాధించిన వారు, ఐటీఐ డ్రాఫ్ట్స్‌మెన్(సివిల్) డిప్లమా, బీటెక్ (సివిల్) అర్హతలు ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులకు 50 పని దినాలలో (మే 26 నుంచి జూలై 26) శిక్షణ ఇస్తామని, శిక్షణ కోసం ఓసీ అభ్యర్థులు రూ.10వేలు, బీసీలు రూ.5వేలు, ఎస్సీ, ఎస్టీలు రూ.2500 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఇతర వివరాలకు 98490 81489, 70326 34404, 94419 47339 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఉచిత శిక్షణ.. ఉన్నతికి నిచ్చెన

- స్వచ్ఛంద సంస్థల సేవ.. విద్యార్థుల భవితకు తోవ
- సద్వినియోగం చేసుకుంటున్న పేద విద్యార్థులు

సిరిసిల్లకల్చరల్: కార్మిక క్షేత్రంలో నిరుపేద విద్యార్థులకు ఉచిత శిక్షణ వారి ఉన్నతికి ఆలంబనగా నిలుస్తోంది. జిల్లా కేంద్రంలో పలు స్వచ్ఛంద, ధార్మిక సంస్థల నేతృత్వంలో పోటీ పరీక్షలకు ఇస్తున్న ఉచిత శిక్షణతో కార్మిక కుటుంబాల పిల్లలకు మేలు కలుగుతోంది. సిరిసిల్లలో వివిధ ప్రభుత్వ ఉద్యోగులు, వృత్తి రంగ నిపుణుల ఐక్య వేదికగా పోపా (పద్మశాలి అఫిషియల్స్, ప్రొఫెషనల్స్ అసోసియేషన్) మూడు దశాబ్దాలుగా పలు సామాజిక సేవలు అందిస్తోంది. ప్రతి వేసవిలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు నెల రోజుల పాటు ఉచితంగా పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కోసం శిక్షణ ఇస్తోంది. సుమారు 120 మంది విద్యార్థులు రోజూ తరగతులకు హాజరవుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వేదికగా ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన పద్మశాలి ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులు తమ సేవలను స్వచ్ఛందంగా అందిస్తున్నారు.




పాలిసెట్ ఉచిత శిక్షణ తరగతులకు హాజరైన విద్యార్థులు

శ్రీ సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో..

కొన్నేళ్లుగా సిరిసిల్లలో శ్రీ సత్యసాయి సేవాసమితి ధార్మిక సంస్థ డైట్ సెట్, పాలిసెట్‌లకు ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తోంది. కోవిడ్ సమయంలో అంతరాయం ఏర్పడినా తిరిగి యథావిధిగా క్లాసులు నిర్వహిస్తోంది. వాసవీనగర్‌లోని సమితికి చెందిన మందిరంలో పాలిటెక్నిక్ శిక్షణకు వందమందికి పైగా విద్యార్థులు హాజరవుతున్నారు. సత్యసాయి భక్తులైన సబ్జెక్టు నిపుణులు స్వచ్ఛందంగా తమ సేవలు అందిస్తున్నారు.


పిల్లలకోసం మా వంతుగా



మండే ఎండల్లో తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు స్నాక్స్ అందించాలని నేనూ, మా స్నేహితులు ముందుకు వచ్చాం. పత్తిపాక దామోదర్, మోర విష్ణు, పత్తిపాక మధు, కారంపురి శ్యాంసుందర్, గుడ్ల ప్రభాకర్, నాగుల రవీందర్, దాసరి నాగేశ్వర్, సబ్బని భాస్కర్‌తో కలిసి రోజూ అరటి పండ్లు, స్నాక్స్ అందిస్తున్నాం. ఎల్లారెడ్డిపేట ఎంఈవో గాలిపెల్లి కృష్ణహరి, మోర దామోదర్ తాగునీటి వసతి కల్పిస్తున్నారు.

– గాజుల ప్రతాప్, విశ్రాంత ప్రిన్సిపాల్


పేద పిల్లలకు వరప్రసాదం



నేత పరిశ్రమపై ఆధారపడిన ఎంతో మంది కార్మిక కుటుంబాలకు పాలిసెట్ ఉచిత శిక్షణ వరప్రసాదంగా మారింది. ఏటా 100 మందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందుతున్నారు. గతేడాది ఉత్తమ ఫలితాలను సాధించడం ప్రేరణగా నిలిచింది. అదే స్ఫూర్తితో ఈ సారి కూడా కొనసాగిస్తున్నాం. స్వచ్ఛంద సేవలందిస్తున్న ఉపాధ్యాయులకు పోపా తరఫున ధన్యవాదాలు.

– మామిడాల భూపతి, పోపా ఉపాధ్యక్షుడు

పుష్కర కాలంగా



పదేళ్లకు పైగా సమితి సారథ్యంలో పిల్లలకు పలు పోటీ పరీక్షలకు ఉచితంగా శిక్షణ తరగతులు కొనసాగిస్తున్నాం. డైట్ సెట్ ద్వారా సీట్లు సాధించిన చాలా మంది విద్యార్థులు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎంపికై జీవితంలో స్థిరపడడం చాలా సంతృప్తి కలిగించే అంశం. ఏటా 150 మంది పిల్లలు ఈ శిబిరం ద్వారా ప్రయోజనం పొందడం సమితి సభ్యులకు సంతోషాన్ని కలిగిస్తోంది.

– గోశికొండ బాలరాజు, శిబిరం నిర్వాహకుడు

క్లుప్తంగా

ఈత, తాటి వనం దగ్ధం

ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం ఆవునూర్‌లో ఈత, తాటి వనం కాలిపోయిందని గౌడ సంఘం బాధ్యుడు బైరి శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఎల్లమ్మ ఆలయం సమీపంలో ఓ రైతు తన పొలంలో కొయ్యకాళ్లకు శుక్రవారం నిప్పు పెట్టాడన్నారు. ఆ మంటలు వ్యాపించి 300 ఈత, తాటి చెట్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకు కారణమైన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని గీతకార్మికులు బండి లక్ష్మణ్, సర్పాగౌడ్, అంజాగౌడ్, భాస్కర్‌గౌడ్, వెంకటేశ్ డిమాండ్ చేశారు. ఎక్సైజ్ అధికారులు విచారణ చేసి నిందితులను చట్టపరంగా శిక్షించాలని కోరారు.

గడ్డివాము..

తంగళ్లపల్లి/ఇల్లంతకుంట: (సిరిసిల్ల): తంగళ్లపల్లి– ఇల్లంతకుంట మండలాల శివారు నాయినోనిపల్లె గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు గడ్డివాములు దగ్ధం అయ్యాయి. ఫైర్ ఆఫీసర్ ఎస్.నరేందర్ వివరాల ప్రకారం గ్రామానికి చెందిన మెతుకు బాలయ్యకు చెందిన గడ్డివాములకు ప్రమాదవశాత్తు నిప్పంటుకుంది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. ఇల్లంతకుంట మండలం వెల్జిపురం గ్రామానికి చెందిన కుల్ల రవీందర్ తన వ్యవసాయ బావి వద్ద గడ్డివాము కట్టలు 250 పశుగ్రాసం కోసం ఒకచోట పేర్చాడు. శుక్రవారం మధ్యాహ్నం రైతు గడ్డివాము పరిసరాల్లో చెత్తను కాలబెడుతుండగా ప్రమాదవశాత్తు నిప్పురవ్వలు గడ్డివాముపై పడి పూర్తిగా దగ్ధమైందని రవీందర్ తెలిపాడు.

తాళం వేసిఉన్న ఇంట్లో చోరీ

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేటలోని మొదటి బైపాస్‌రోడ్డులో వైన్స్ సమీపంలో తాళంవేసి ఉన్న ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్సై లక్ష్మణ్, బాధితుడు ఒద్దిరాల శ్రీనివాస్ వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఒద్దిరాల శ్రీనివాస్ బైపాస్‌రోడ్డులో కొంతకాలంగా హోటల్ నిర్వహిస్తున్నాడు. ఉదయం 10గంటలకు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులంతా కలిసి హోటల్‌కు వెళ్లారు. మధ్యాహ్నం భోజనం చేయడానికి ఇంటికి వెళ్లగా, ఇంటి ప్రధాన ద్వారం తాళం పగులగొట్టి ఉంది. లోనికి వెళ్లి చూడగా, బీరువాను ధ్వంసం చేసి ఉంది. అందులో దాచి ఉంచిన రూ.25వేలు, 15తులాల వెండి పట్టగొలుసులు, మూడు తులాల బంగారం చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. ఎస్సైలు రమాకాంత్, లక్ష్మణ్, డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

జగిత్యాలలో..

జగిత్యాలక్రైం: జగిత్యాల పట్టణ శివారులోని శివాజీవాడ, సీతారాంనగర్‌లో తాళం వేసి ఉన్న రెండు ఇళ్లలో గురువారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. సీతారాంనగర్‌కు చెందిన చల్ల లక్ష్మారెడ్డి, శివాజీవాడకు చెందిన వెంకటరమణ పని నిమిత్తం ఇంటికి తాళం వేసి వేరే ఊరికి వెళ్లారు. గురువారం రాత్రి దుండగులు తాళాలు పగులగొట్టి ఇద్దరు ఇళ్లలోని ఆరుతులాల బంగారం, 16 తులాల వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. పట్టణ ఎస్సై కిరణ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

గల్ఫ్ ఏజెంట్ రిమాండ్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): గల్ఫ్ దేశాలకు పంపిస్తానంటూ జిల్లాలో పలువురిని మోసం చేసిన ఏజెంట్‌ను తంగళ్లపల్లి పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. ఎస్సై బి.రామ్మోహన్ వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా భీంగల్‌కు చెందిన సయ్యద్ అశ్వక్ అనే గల్ఫ్ ఏజెంట్ సిరిసిల్ల జిల్లాకు చెందిన 23మందిని అజర్‌బైజాన్ దేశం పంపిస్తానని రూ.80 లక్షలు తీసుకుని, విజిట్ వీసాలు ఇచ్చి మోసం చేశాడు. మండెపల్లికి చెందిన బాధితుడు పంజా వేణు ఫిర్యాదు మేరకు సయ్యద్ అశ్వక్‌ను అరెస్టుచేసి కోర్టులో హాజరు పరచగా, 15 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై రామ్మోహన్ తెలిపారు.

ఆకతాయిలు పెట్టిన రాళ్లతో నిలిచిన రైలు

మెట్‌పల్లి(కోరుట్ల): ఆకతాయిలు చేసిన పనికి రైలు కొద్ది సేపు నిలిచిన ఘటన గురువారం మెట్‌పల్లి పట్టణంలో జరిగింది. వివరాలు..నిజామాబాద్ నుంచి కరీంనగర్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు ఉదయం 6గంటలకు మెట్‌పల్లి శివారులోని రేగుంట ఎస్సారెస్పీ వంతెన వద్దకు చేరుకుంది. అప్పటికే అక్కడ కొందరు ఆకతాయిలు పట్టాలపై రాళ్లు పెట్టారు. దీనిని గమనించిన లోకోపైలెట్ వెంటనే రైలును నిలిపివేశాడు. అనంతరం ఈ ఘటనపై రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం పోలీసులు మెట్‌పల్లికి వచ్చి లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో కొందరిని అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. మైనర్లు అయినా వారంతా ఆకతాయిగా చేసిన పని అని గుర్తించి విడిచిపెట్టినట్లు సమాచారం.

విజయోస్తు.. చికిత

- నేడు షాంఘైలో జరిగే ప్రపంచకప్ అర్చరీ స్టేజ్–2 ఫైనల్ పోరులో పాల్గొంటున్న చికిత
- స్వర్ణంతో తిరిగి రావాలంటున్న పలువురు



సాధించిన పతకాలతో చికిత

కరీంనగర్‌స్పోర్ట్స్: మారుమూల గ్రామం నుంచి ఎదిగి నేడు భారత జాతీయ పతాకాన్ని పొరుగు దేశం చైనాలో రెపరెపలాడించేందుకు ఒక్క అడుగు దూరంలో నిలువడం విశేషం. చిన్నప్పటి నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్న తను అర్చరీ క్రీడలో రాణించి నేడు భారత బృందంలో మేటి క్రీడాకారిణిగా ఎదిగింది పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత. ప్రస్తుతం చైనా దేశంలోని షాంఘైలో జరుగుతున్న ప్రపంచకప్ అర్చరీ స్టేజ్–2 పోటీల్లో భారత మహిళల కాంపౌండ్ జట్టు అద్వితీయ ప్రతిభతో ఫైనల్‌లో అడుగుపెట్టింది. భారత జట్టులోని ముగ్గురిలో తానిపర్తి చికిత ఒకరు. శనివారం మెక్సికోతో జరిగే ఫైనల్ పోరులో భారత మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచి స్వర్ణంతో తిరిగిరావాలని పలువురు తమ అభిప్రాయాలను వెల్లడించారు.

చికిత సాధించిన పతకాలు

- హర్యానా రాష్ట్రంలోని సోనిపట్‌లో శిక్షణ పొందుతున్న చికిత ఇదివరకు ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని తెలంగాణకు, భారత దేశానికి పతకాలు సాధించిపెట్టింది.
- తాజాగా ఫిబ్రవరిలో ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడల్లో కాంస్య పతకం సాధించింది.
- మార్చిలో బ్యాంకాక్‌లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో సైతం కాంస్య పతకం సాధించింది.
- ప్రస్తుతం జరుగుతున్న పోటీల్లో కూడా పతకం ఖాయం చేసుకుంది.

కూతురుపై నమ్మకం ఉంది

నా కూతురుపై నమ్మకం ఉంది. తప్పకుండా స్వర్ణ పతకం సాధిస్తుంది. దేశ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తుంది.
– తానిపర్తి శ్రీనివాస్ రావు, చికిత తండ్రి

జాతీయ పతాకం ఎగరేయాలి

స్వర్ణ పతకం సాధించాలి. పొరుగు దేశం చైనాలో భారత జాతీయ పతాకాన్ని సగౌరవంగా ఎగురవేయాలి.
– చింతకుంట విజయరమణారావు, ఎమ్మెల్యే, పెద్దపల్లి

చాంపియన్‌గా నిలవాలి

ఫైనల్‌లో మెక్సికోపై విజేతగా నిలిచి చరిత్ర సృష్టించాలి. చాంపియన్ గా నిలవాలి.
– సురేశ్, డీవైఎస్‌ఓ, పెద్దపల్లి

ప్రపంచపటంలో నిలపాలి

అర్చరీలో స్వర్ణ పతకం సాధించాలి. పెద్దపల్లి జిల్లాను ప్రపంచ పటంలో నిలపాలి.
– ముస్త్యాల రవీందర్, సుల్తానాబాద్ స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు

గర్వంగా ఉంది

మారుమూల గ్రామం నుంచి ఎదిగి నేడు భారత జట్టులో కీలక క్రీడాకారిణి కావడం గర్వంగా ఉంది. విజేతగా తిరిగి రావాలి.
– గసిరెడ్డి జనార్దన్ రెడ్డి, తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి

మరిన్ని పతకాలు సాధించాలి

అర్చరీలో ఎవరికీ అందనంత ఎదిగి నేడు దేశానికి పతకం సాధించడానికి అడుగుదూరంలో నిలిచింది. ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని పతకాలు సాధించాలి.
– కొమురోజు శ్రీనివాస్, ఎస్జీఎఫ్ కార్యదర్శి, పెద్దపల్లి

స్ఫూర్తిగా నిలవాలి

ప్రపంచకప్ అర్చరీ స్టేజ్–2 లో విజేతగా నిలిచి అందరికీ స్ఫూర్తిగా నిలవాలి. తెలంగాణ కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా చాటాలి.
– నందెల్లి మహిపాల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు

పల్లెల్లో పారిశుధ్య పనులకు నిధులు

- స్వచ్ఛ భారత్ గ్రామీణ్ మిషన్ కింద రూ.9.57 కోట్లు మంజూరు



హుజూరాబాద్‌లో కమ్యూనిటీ టాయిలెట్లను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో వేణుమాధవరెడ్డి తదితరులు



కంపోస్టుషెడ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కరీంనగర్‌రూరల్: కేంద్రప్రభుత్వం పరిశుభ్రమైన గ్రామాల కోసం చర్యలు చేపట్టింది. ప్రతీ గ్రామపంచాయతీలో స్వచ్ఛ భారత్ మిషన్ కింద వివిధ పనులే చేపట్టాలని నిర్ణయించింది. ఈ మేరకు ఎస్‌బీఎం–2025–26 ఆర్థిక సంవత్సరంలో కరీంనగర్ జిల్లాకు 368 వివిధ యూనిట్ల నిర్మాణం కోసం రూ.957.23 లక్షలు మంజూరు చేసింది. ఈ నెలాఖరు వరకు ఆయా గ్రామాల్లో నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులను గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. ఇందుకోసం అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించేందుకు సన్నద్ధమవుతున్నారు.

చురుకుగా స్థల పరిశీలన..

స్వచ్ఛభారత్ గ్రామీణ్ మిషన్‌కు సంబంధించిన పనుల వివరాలను ఆయా గ్రామపంచాయతీల్లో ప్రదర్శిస్తారు. ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామస్తుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తారు. గ్రామాల్లో ఎక్కడెక్కడ సామూహిక మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు అవసరమో పరిశీలించి, ఇందుకు అవసరమైన స్థలాలను ఎంపిక చేస్తారు. పంచాయతీల్లో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం, ఇంకుడుగుంతలు, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ యూనిట్లు నిర్మించనున్నారు. ప్లాస్టిక్ నిర్వహణ యూనిట్ కోసం తిమ్మాపూర్ మండలం అల్గునూరులో 20గుంటల స్థలాన్ని అధికారులు ఇటీవల పరిశీలించి ఎంపిక చేశారు. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన గ్రామపంచాయతీలు.. శంకరపట్నం మండలం గుడాటిపల్లి, నల్లవెంకయ్యపల్లి, అంబేడ్కర్‌నగర్, మానకొండూరు మండలం రాఘవపూర్, బంజేరుపల్లి, సైదాపూర్ మండలం గర్రెపల్లి, కుర్మపల్లి, గొల్లగూడెం, గన్నేరువరం మండలం గుండ్లపల్లి ఎక్స్‌రోడ్డు, హుజూరాబాద్ మండలం అంబేడ్కర్‌నగర్‌లో కొత్తగా కంపోస్టుషెడ్లు నిర్మిస్తారు. కొత్త గ్రామపంచాయతీలన్నింటినీ బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించేలా అవగాహన కల్పించి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఇప్పటివరకు 2,600 వ్యక్తిగత మరుగుదొడ్లు, 9 సామూహిక మరుగుదొడ్లు, 6 కంపోస్టుషెడ్లు మంజూరైనట్లు ఎస్‌బీఎం జిల్లా కో ఆర్డినేటర్ రమేశ్ తెలిపారు. ఈ నెలాఖరు వరకు ఆయా యూనిట్లకు స్థలాలను ఎంపిక చేయడంతోపాటు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు డీఆర్‌డీవో వేణుమాధవరెడ్డి తెలిపారు. వచ్చేనెలలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేసి, జూలైలో పనులు ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

జిల్లాకు మంజూరైన యూనిట్లు, నిధులు

యూనిట్	లక్ష్యం	విలువ	నిధులు(రూ.లక్షల్లో)
వ్యక్తిగత మరుగుదొడ్లు	3097	రూ.12వేలు	రూ.371.64
సామూహిక మరుగుదొడ్లు	9	రూ.3లక్షలు	రూ.27
ప్లాస్టిక్ నిర్వహణ యూనిట్లు	2	రూ.64లక్షలు	రూ.128
కంపోస్టుషెడ్లు	10	రూ.1.50లక్షలు	రూ.15
సామూహిక ఇంకుడుగుంతలు	126	రూ.93వేలు	రూ.117.18
వ్యక్తిగత ఇంకుడుగుంతలు	3,713	రూ.7వేలు	రూ.241.35
వ్యక్తిగత ఇంకుడుగుంతలు(ఈజీఎస్)	32	రూ.93వేలు	రూ.29.76
ప్రభుత్వ స్థలాల్లో ఇంకుడుగుంతలు	210	రూ.13వేలు	రూ.27.30

పెళ్లి బరాత్‌కు వెళ్లి వస్తూ..

- అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన బైక్
- యువకుడు మృతి.. మరొకరి పరిస్థితి విషమం



వెంకటేశ్ మృతదేహం

జగిత్యాలక్రైం: ముగ్గురు యువకులు స్నేహితుడి పెళ్లి బరాత్‌కు వెళ్లి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా మరొకరికి తీవ్ర, ఇంకొకరికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు.. జగిత్యాల పట్టణ శివారులోని గోవిందుపల్లికి చెందిన కొలగాని వెంకటేశ్ (18), విద్యానగర్‌కు చెందిన గడిల విఘ్నేశ్, చిలుకవాడకు చెందిన చెట్‌పల్లి అజయ్ బుధవారం ద్విచక్ర వాహనంపై బుగ్గారం మండలం గోపులాపూర్ గ్రామంలో జరిగిన స్నేహితుడి పెళ్లికి వెళ్లారు. రాత్రి బరాత్‌లో పాల్గొన్నారు. గురువారం వేకువజామున జగిత్యాలకు వస్తుండగా పట్టణంలోని నిజామాబాద్ రోడ్‌లో ద్విచక్ర వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో కొలగాని వెంకటేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. చెట్‌పల్లి అజయ్ పరిస్థితి విషమంగా ఉంది. గడిల విఘ్నేశ్‌కు స్వల్పగాయాలయ్యాయి. పట్టణ ఎస్సై కిరణ్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్ తండ్రి రవి ఫిర్యాదు మేరకు ద్విచక్ర వాహనం నడుపుతున్న గడిల విఘ్నేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై మన్మదరావు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు



ధ్వంసమైన ఆటో

తిమ్మాపూర్: కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం ఎల్‌ఎండీ డైట్ కళాశాల సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. స్థానికుల సమాచారం ప్రకారం.. మండలంలోని నర్సింగాపూర్ నుంచి నలుగురు ఆటోలో దైవదర్శనం కోసం వేములవాడ వెళ్తున్నారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి కరీంనగర్ వైపు వెళ్తున్న మరో ఆటో నర్సింగాపూర్ వాసులు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దైవదర్శనం కోసం వెళ్తున్న నలుగురు, ఆటో డ్రైవర్ సంపత్ గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎల్‌ఎండీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని 108కు సమాచారం ఇచ్చారు. క్షతగాత్రులను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

గురుకులాల్లో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలి



కరీంనగర్‌లో ప్రచారం చేస్తున్న ఆర్‌ఎల్‌సీ సురేశ్, ఉపాధ్యాయులు

కరీంనగర్‌రూరల్: ప్రభుత్వం మైనార్టీ గురుకులాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మైనార్టీ గురుకులాల పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల రీజినల్ లెవల్ కోఆర్డినేటర్ డాక్టర్ కనపర్తి సురేశ్ కోరారు. శుక్రవారం కరీంనగర్‌లోని అస్లాం మజీద్ వద్ద మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలపై ఉపాధ్యాయులతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీలు అందరితో సమానంగా విద్యారంగంలో అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో ప్రభుత్వం గురుకులాలను ప్రవేశపెట్టిందన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గురుకుల పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. పదో తరగతి ఫలితాల్లో గురుకులాలు వందశాతం ఉత్తీర్ణత సాధించడం ఉపాధ్యాయుల పనితీరుకు నిదర్శనంగా నిలిచిందని అన్నారు. ఈ సంవత్సరం నుంచి కొత్తగా 8వ తరగతి నుంచి ఐఐటీ, నీట్ ఫౌండేషన్ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ కోఆర్డినేటర్ మహేందర్, రాజు, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా మల్లన్న సన్నిధిలో పూజలు



ఓదెల(పెద్దపల్లి): ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ఓదెల శ్రీమల్లికార్జునస్వామి సన్నిధిలో శుక్రవారం ఆలయ సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. పాక్‌లోని ఉగ్రవాదులతో ధైర్యసాహసాలతో పోరాడుతున్న భారత త్రివిధ దళాలకు మద్దతుగా పూజలు చేశారు. దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపట్టారు. మల్లికార్జునస్వామి, శ్రీసీతారామచంద్ర స్వామి, నందీశ్వరుల సన్నిధిలో పూజలు చేసి టెంకాయలను కొట్టారు. అనంతరం కశ్మీర్‌లో దుండగుల చేతిలో మృతి చెందిన పర్యాటకుల ఆత్మశాంతికి రెండు నిమిషాలపాటు మౌనం పాటించారు. ఆలయ ఈవో సదయ్య, అర్చకులు పాల్గొన్నారు.

సెలవులు రద్దు

గోదావరిఖని: భారత్ – పాక్ మధ్య తలెత్తిన ఉద్రిక్తల నేపథ్యంలో సింగరేణి లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తూ శుక్రవారం యాజమాన్యం ఆదేశాలిచ్చింది. ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ పరిస్థితులు, పొరరక్షణ కసరత్తుల దృష్ట్యా ప్రతీఅధికారి తన విధుల్లో ఉండాలని రాష్ట్ర ఎనర్జీ ప్రిన్సిపల్ సెక్రటరీ సూచనల మేరకు సెలవులు రద్దు చేసినట్లు పేర్కొంది. వెనువెంటనే విధులకు హాజరు కావాలని ఉత్తర్వుల్లో సూచించింది. ప్రతీఒక్కరు తమ విధుల్లో ఉండాలని పేర్కొంది. సంస్థ ఆదేశాలను వెంటనే అమలు చేయాలని సింగరేణి సీఎండీ ఎన్.బలరాం ఆదేశించారు.





ఎన్టీపీసీ ప్రాజెక్టులో మాక్‌డ్రిల్

- విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొంటాం
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా







జ్యోతినగర్(రామగుండం): అనూహ్య ఘటనలు చోటుచేసుకుంటే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారయంత్రాంగం అన్ని వేళలా సన్నద్ధంగా ఉందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెద్దపల్లి జిల్లా రామగుండం పోలీస్ కమిషనరేట్‌లోని ఎన్టీపీసీ ప్రాజెక్టులోని భద్రత సిబ్బందితో శుక్రవారం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సీపీ మాట్లాడుతూ, అకస్మాత్తుగా ఏదైనా ప్రమాదం జరిగితే భద్రతా సిబ్బంది ఎలా స్పందించాలో ముందస్తుగా మాక్‌డ్రిల్ నిర్వహించామని అన్నారు. ప్రాజెక్టులో ప్రమాదాలు, అగ్ని ప్రమాదాలు వాటిల్లితే ఎలా వ్యవహరించాలనే అంశాలపై రక్షణ దళాలు అప్రమత్తమవుతాయని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో రక్షణ నిమిత్తం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలకు, అక్కడ ఎదురయ్యే పరిస్థితులకు అనుగుణంగా దళాలు స్పందించాయని వివరించారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, గోదావరిఖని ఏసీపీ రమేశ్, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఎన్టీపీసీ ఎస్సై ఉదయ్‌కిరణ్, సీఐఎస్‌ఎఫ్ సీనియర్ కమాండెంట్ అరవింద్ కుమార్, డిప్యూటీ కమాండెంట్ ఎస్.ఆంజనేయరాజు, ఓవీకేశాస్త్రి, కన్వర్, అసిస్టెంట్ కమాండెంట్ ఆకేశ్వర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రాజన్నా... దీవించు





వేములవాడ: వేములవాడ రాజన్నను శుక్రవారం 30 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు తమ కుటుంబ సభ్యులతో కలసి రాజన్నకు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అధికారులు భక్తుల ఏర్పాట్లను పరిశీలించారు. ఆపరేషన్ సిందూర్ దిగ్విజయం కావాలని, భారత త్రివిధ దళాలు క్షేమంగా ఉండాలని రాజన్న ఆలయంలో శుక్రవారం ఆలయ అర్చకులు స్వామివారి మహామంటపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సైన్యానికి దైవిక బలరక్షణ, స్వామి వారి ఆశీస్సులు ఉండాలని దేవాదాయ ధర్మాదాయశాఖ ఆదేశాలతో చండీ సహిత రుద్ర హోమం నిర్వహించారు.



వంగిన విద్యుత్ స్తంభాలు







విద్యుత్ తీగలకు సపోర్టుగా స్తంభాలు ఉండాలి. కానీ, ఇక్కడ చూస్తే వంగిన స్తంభాలకు విద్యుత్ తీగలు సపోర్టుగా ఉన్నట్లు కనిపిస్తోంది. దీంతో ఎటువైపు నుంచి ప్రమాదం ముంచుకొస్తుందోనని అన్నదాతలు అరచేతిలో ప్రాణాలు పెట్టుకొంటున్నారు. అకాలవర్షాలు, ఈదురుగాలులతో స్తంభాలు కూలిపోతే పెద్ద ప్రమాదమే జరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. కాల్వశ్రీరాంపూర్ మండలం ఇదులాపూర్ – జాఫర్‌ఖాన్‌పేట మధ్య రోడ్డు వెంట వంగిన విద్యుత్ స్తంభాలు ఇలా ‘సాక్షి’ కెమెరాకు చిక్కాయి. – సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

ఏసీబీకి చిక్కిన ఇరిగేషన్ ఈఈ



పట్టుబడిన ఈఈ అమరేందర్‌రెడ్డి

కరీంనగర్‌క్రైం: సిరిసిల్ల ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి రూ.60వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు శుక్రవారం రాత్రి పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆవునూరు –అగ్రహారం మధ్య నిర్మించిన చెక్ డ్యాంకు సంబంధించి పనులు పూర్తికాగా బిల్లు చెల్లింపునకు సంబంధించి వరంగల్ ప్రాంతానికి చెందిన గుత్తేదారును రూ.60వేల డిమాండ్ చేశాడు. సదరు డబ్బులు తీసుకుంటున్న సమయంలో నగరంలోని విద్యారణ్యపురిలోని అమరేందర్‌రెడ్డి ఇంట్లో రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు చిక్కాడు. దీనిపై విచారణ కొనసాగుతోంది.